క్లుప్తంగా

ప్రమాణస్వీకారానికి మాజీ ఎంపీ మేకపాటికి ఆహ్వానం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం భీమవరం సహకార సంఘం నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాల్సిందిగా ఆ సొసైటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సోమల మాధవ రెడ్డి శనివారం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డిని సహచర వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, రాంపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోకూరు చెంచుకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ధ్యాన, జ్ఞాన మహాయజ్ఞం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పిరమిడ్ మాస్టర్లు

ఉదయగిరి: వచ్చే నెల 2వ తేదీ నుంచి 21 రోజుల పాటు ఉదయగిరిలో ధ్యాన, జ్ఞాన మహాయజ్ఞ కార్యక్రమం జరుగుతుందని పిరమిడ్ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రథం ద్వారా ప్రచారంతో పాటు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీల ఏర్పాటు, ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ధ్యానం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రతి రోజూ ధ్యానం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని శనివారం తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకుని వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బంది దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ సహాయకులు సందానీబాషా, ప్రసాద్, సీపీ నరసింహారావు, వీఆర్వోలు బి.వెంకటేశ్వర్లు, జాఫర్, వెంకట్, సర్వేయర్ రవి పాల్గొన్నారు.

24 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరసింహప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల్లో దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఉపాధ్యాయుడిగా మనోహర్‌ను నియమించిందన్నారు.

హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

జలదంకి: స్థానిక పెద్దచెరువు కట్ట సమీపంలో ఉన్న హిందూశ్మశాన వాటికకు స్థలాన్ని ప్రభుత్వం మరొకచోట చూపించాలని జలదంకి వైఎస్సార్‌సీపీ నాయకురాలు, 6వ వార్డు మెంబరు సూరె వెంకటపద్మావతి కోరారు. శనివారం జలదంకి సచివాలయంలో జరిగిన పంచాయతీ సమావేశంలో సర్పంచ్ అనూరాధ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న హిందూ శ్మశాన వాటిక స్థలంలో కావలి–ఉదయగిరి బైపాస్ రోడ్డు ఏర్పాటవుతుందన్నారు. శ్మశాన వాటికకు మరొక చోట స్థలం కేటాయించాలని ఆమె కోరారు.

పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు

ఆత్మకూరురూరల్: వేసవి సెలవుల నేపథ్యంలో విద్యా సంవత్సరం ముగుస్తుండగా ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు శనివారం నిర్వహించారు. విద్యార్థులకు వారి పరీక్షల మెమోలు అందజేసి తల్లిదండ్రులకు పిల్లల అభ్యాసన సామర్థ్యాల గురించి వివరించారు.

ఓవర్‌టేక్ చేస్తూ లారీని ఢీకొన్న కారు

కావలి రూరల్: ముందు వెళ్తున్న లారీని కారు ఓవర్‌టేక్ చేస్తూ అదుపుతప్పి ఢీకొన్న ఘటన శనివారం కావలి మండలం గౌరవరం జాతీయ రహదారిపై జరిగింది. విజయవాడ సమీపంలోని పెద్దపాడుకు చెందిన అరవలి సూర్యప్రకాష్ చెన్నైలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కారులో స్వగ్రామం వెళ్తుండగా గౌరవరం వద్దకు వచ్చే సరికి ముందువెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ముందు వెళ్తున్న ట్రాలీ లారీ ఒక్కసారిగా పక్కకు రావడంతో లారీ వెనుక భాగం కారుకు తగిలింది. దీంతో కారు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అందరికి స్వల్పగాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జనమంతా జగన్ వెంటే

- నియోజకవర్గంలో 90 వేల ఇళ్ల సందర్శన
- ప్రభుత్వానికి మద్దతుగా 72 వేలకు పైగా మిస్డ్‌కాల్స్
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందనే విషయం మెగా పీపుల్స్ సర్వే ద్వారా స్పష్టమైందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో శనివారం విజయోత్సవ సభ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులతో కలిసి నిర్వహించిన ఈ విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో లక్షా రెండు వేల ఇళ్లు ఉండగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ఈ నెల7వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సుమారు 90 వేల ఇళ్లను సందర్శించినట్లు తెలిపారు. సందర్శించిన ఇళ్ల నుంచి ప్రజా మద్దతు పుస్తకాల ద్వారా అభిప్రాయాలు సేకరించగా 72,500 పైచిలుకు మంది ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్‌కాల్స్ ఇచ్చి 'మా నమ్మకం నువ్వే జగన్' అని స్పష్టం చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ చిత్తశుద్ధితో అమలు చేశారని, అందుకనే ధైర్యంగా ప్రజల ముంగిటకు వెళ్లగలుగుతున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా అనేక కొత్త పథకాలు కూడా ప్రవేశ పెట్టిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్నీ హామీలు నెరవేర్చామనే ధైర్యంతోనే దేశంలో ఏ పార్టీ కూడా చేపట్టని విధంగా ప్రజా మద్దతు పుస్తకాలతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లినట్లు తెలిపారు. ప్రజల నుంచి కూడా అనూహ్య స్పందన లభించిందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా తమ జీవితాల్లో వచ్చిన మార్పులు సంతోషంగా పంచుకుంటూ ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్‌కాల్స్ ఇచ్చారని వివరించారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

90 శాతం ప్రజల మద్దతు జగనన్నకే

- ముగిసిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 'జగనన్నే మా భవిష్యత్తు', 'జగనన్న నువ్వే మా నమ్మకం' కార్యక్రమాలతో ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమాలను వివరించి చేపట్టిన సర్వేలో 90 శాతం ప్రజల మద్దతు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ముగిసిన సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, అన్ని మండల పార్టీ కన్వీనర్లు మాట్లాడారు. రాష్ట్రంలో 1.45 కోట్ల కుటుంబాలను జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా కలిసి ప్రభుత్వంపై వారి అభిప్రాయాన్ని తెలియజేసే మిస్డ్‌కాల్‌కు 1.10 కోట్ల మంది స్పందించారన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలో నూరు రోజులు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించినట్లు తెలిపారు. సంక్షేమం ఫలాలు అర్హతే ప్రమాణికంగా అందాయని, ప్రతిపక్షాలు దీన్ని సహించలేక బురద జల్లడమే అజెండాగా చేస్తున్నాయని విమర్శించారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా నవరత్నాలు పథకాలు అమలవుతున్నాయని, అనవసర రాద్ధాంతం చేయడాన్ని ప్రతిపక్షాలు విరమించుకోవాలని హితవు పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు, అనంతసాగరం మండల పార్టీ కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మర్రిపాడు కన్వీనర్ సుబ్బిరెడ్డి, చేజర్ల మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఏఎస్‌పేట నాయకుడు పూనూరు రమేష్‌రెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సొసైటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, ఐవీ రమణారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు శ్రీరామరక్ష

- మాజీ ఎమ్మెల్యే వంటేరు



మాట్లాడుతున్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

వింజమూరు (ఉదయగి): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలో నిలబెడతాయని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి అన్నారు. వింజమూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో 8 మండలాల నాయకులతో జగనన్న మా భవిష్యత్తు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలను కలిశామన్నారు. వీరిలో 1.10 కోటి కుటుంబాలు మిస్డ్ కాల్ ద్వారా తమ మద్దతు తెలిపారన్నారు. దీన్ని బట్టి జగన్ ప్రభుత్వం మీద ప్రజల్లో నమ్మకం ఏ మాత్రం తగ్గలేదన్నారు. ఇంతటి ప్రజాదరణ పొందడం ప్రతిపక్ష పార్టీకి మింగుడు పడటం లేదన్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రపంచంలో ఏ పాలకులూ చేపట్టలేదని, అది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమైందన్నారు. రాష్ట్రం ఎంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు పేదలకు అందించడంలో వెనుకంజ వేయలేదన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీకి చెడ్డపేరు తెచ్చారని, ఆ చెడ్డపేరు పోగొట్టాలంటే ఉదయగిరి నియోజకవర్గంలో 30 వేల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా తమ ప్రభుత్వం ప్రజాదరణ పొందిందన్నారు. గతంలో కంటే ప్రజల జీవన పరిస్థితులు ఏ విధంగా మార్పు చెందాయో ఈ పథకాలే నిదర్శనంగా నిలిచాయన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టి పేద ప్రజలకు మరింత మెరుగైన సేవ చేసే భాగ్యాన్ని దేవుడు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు గణం బాలకృష్ణారెడ్డి, వెంకట్రావు, నాగేంద్ర, పి.మాల్యాద్రిరెడ్డి, పార్టీ కన్వీనర్లు బాలగువారెడ్డి, వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ చేజర్ల చలమారెడ్డి, అల్లూరురాజు, గురవారెడ్డి, పి.మాలకొండారెడ్డి, జయంత్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, శివలీల, వెంకట్రావు, అనూరాధ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, మాజీ కన్వీనర్లు, సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం, మర్రిపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయా గ్రామాల నాయకులు శనివారం నిర్వహించారు. వెంగారెడ్డిపాళెంలో కన్వీనర్ తురకా నరసింహులు, గృహసారథులు దోర్నాదుల వెంకటేశ్వర్లు, మన్నేపల్లి శ్రీనివాసులు, అందే కుమారి, జమ్ముల మాధురి, సిద్ధం హేమలత, కరేటి పెంచలరావు మారెళ్ల పెంచలయ్య పాల్గొన్నారు. సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలందరూ కలిసి జగనన్న పరిపాలన చాలా బాగుందని, జగనన్న ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలు కూడా కొనసాగాలన్నారు.



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుకేషన్ డే

ఆత్మకూరు: పట్టణంలోని హిల్ రోడ్డు మేదరివీధి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుకేషన్ డే నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం ముగియడంతో అంగన్‌వాడీ నిర్వాహకురాలు కె రమణమ్మ చిన్నారులతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచి పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్య అనంతరం చిన్నారులను ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలో చేర్చనున్నట్లు నిర్వాహకురాలు తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



గ్రాడ్యుయేషన్ డే సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్న కాలనీలను సద్వినియోగం చేసుకోండి

సీతారామపురం: మండలంలో జగనన్న కాలనీలకు అర్హత పొందిన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని బిట్–2 సచివాలయంలో శనివారం లబ్ధిదారులకు జగనన్న కాలనీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న గృహాలకు రూ.1.80 లక్షలు అందించడమే కాకుండా డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేలు రుణం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యకుమారి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం పుల్లయ్య, కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జునతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులు వేసవిలో తమ సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞానం కోసం గ్రంథాలయాలకు వెళ్లాలని సూచించారు. సాయంత్రం వేళల్లో కళాశాల గ్రౌండ్‌లో తప్పనిసరిగా ఆటలు ఆడుతూ తమ శారీరక దారుఢ్యం పెంచుకోవాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కె మధుసూదన్ శాస్త్రి పాల్గొన్నారు.

3లోపు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

సీతారామపురం: మండలంలో రైతుభరోసా పథకానికి అర్హులైన రైతులు మే 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్, బ్యాంకు అకౌంట్, పాస్ బుక్ జెరాక్స్ కాపీలతో వీఏఏలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

సీతారాముల కల్యాణానికి అన్నదానం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని కళ్యాణ వేడుకలను తిలకించారు. గ్రామానికి చెందిన మునగచర్ల వెంకటేశ్వర్లు, కమలా దంపతులు భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిట్టెం శ్రీనివాసులు, రేవూరు గోపాల్ రెడ్డి, ఎదుళ్ల పురుషోత్తం పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

ఉదయగిరి: మండలంలోని దేకూరుపల్లిలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు విశేష పూజలు, అభిషేకాలు, ప్రత్యేకాలంకరణలు చేశారు. ప్రత్యేక వాహనంలో స్వామివార్లను ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పది మంది నిరుపేద క్షయవ్యాధిగ్రస్తులకు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీమతబుస్సుమ్ శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దాతలు అందించిన విరాళాలతో నిరుపేద క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. 2025 నాటికి దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సీహెచ్‌ఓ సులోచన, హెచ్‌ఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అదనపు పోషకాహార కిట్లు పంపిణీ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర పాతభవనంలో అదనపు పోషకాహార కిట్లను మండల వైద్యాధికారిణి శివకల్పనారెడ్డి అందజేశారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్, ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, క్షయ పర్యవేక్షకుడు భోగ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధ్యాన యోగా శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని షిరిడీసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మే 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు ధ్యానం, యోగాపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ ప్రత్యేక తరగతులను ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఏర్పాటు చేసినట్లు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441233806, 89793 58306 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీఎంజేజేబీవైలో చేరండి

చేజర్ల(సోమశిల): ప్రతి ఒక్కరూ పీఎంజేజేబీవై (ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, పీఎంఎస్‌బీవై (ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన)లో చేరాలని వైకేపీ ఏపీఎం టీవీ రమణారావు తెలిపారు. శనివారం వైకేపీ కార్యాలయ ఆవరణలో సీసీలు, వీఓఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అందరూ ఈ బీమా పథకంలో చేరవచ్చన్నారు. 18 నుంచి 70 ఏళ్ల లోపు అర్హులన్నారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు బ్యాంక్ అకౌంట్‌లో రూ.340, 50 నుంచి 70 ఏళ్ల లోపు వారు రూ.20 కట్టాలన్నారు. ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు ఇస్తారని తెలిపారు. సహజ మరణం అయినా రూ.2 లక్షలు ఇస్తారన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ డానియల్ ఖదూరు పాల్గొన్నారు.

చెక్కనగిషీ కళాకారుడి మృతి



అబ్దుల్ బషీర్ (ఫైల్)

ఉదయగిరి: పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలోని చెక్కనగిషీ కేంద్ర వ్యవస్థాపకుడు, హస్త కళాకారుడు షేక్ అబ్దుల్‌బషీర్ (91) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయన చెక్కనగిషీ వస్తువుల తయారీలో నైపుణ్యాన్ని పలువురికి నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించారు. దీంతో ఆయనకు వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ఆయన మృతిపై పలువురు సంతాపం వెలిబుచ్చారు.

ఉన్నతమైన వ్యక్తిత్వం ముఖ్యం



మాట్లాడుతున్న జేసీ రోణంకి కూర్మనాథ్, వేదికపై ఆచార్య అంజిరెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: ప్రతి విద్యార్థికి ఉన్నతమైన వ్యక్తిత్వం ముఖ్యమని పలువురు వక్తలు తెలిపారు. బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జేసీ రోణంకి కూర్మనాథ్, ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. వ్యక్తిత్వ విలువలు పాటిస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని వివరించారు. గతంతో పోలిస్తే ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనువైన టెక్నాలజీలు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై దృష్టి సారిస్తే సులభంగా విజయం సాధించవచ్చని వివరించారు. ఆర్‌ఎస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం కళాశాలలో కల్పిస్తున్న వసతులను వివరించారు. విద్యార్థులకు చదువులతో పాటు వ్యక్తిత్వ వికాసంపై తరచుగా తరగతులు, నూతన టెక్నాలజీలపై నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు, అంతర్జాతీయ కంపెనీలతో క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి మెరుగైన భవిష్యత్ జీవితం అందించే లక్ష్యంగా శిక్షణనిస్తున్నట్లు వివరించారు. కళాశాల వార్షికోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు విద్యార్థుల్లోని సృజనకు నిదర్శనంగా నిలిచి ఆహుతలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ మేనేజర్ విశాలాక్షి, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సీనియర్ మేనేజర్ బాలాజీ, వర్చూసా హెచ్‌ఆర్ మేనేజర్ అభిషేక్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే రాజారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, ఏఓ ఆర్వీ రమణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

- జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, పక్కన ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

చేజర్ల(సోమశిల): వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి సూచించారు. శనివారం అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని, అప్పుడు నీటి సమస్యను తగ్గించుకోవచ్చన్నారు. నిరుపయోగంగా బోర్లు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వెంకటరమణరావు, ఎంపీడీఓ ఎ మధుసూదన్‌రావు, ఏపీ క్రీడల సంఘం డైరెక్టర్ కాలువ నర్సింహులు, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయభాస్కర్ రావు, ఇరిగేషన్ ఏఈ ఖాదర్‌బాషా, సచివాలయ మండల కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏ సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు



మర్రిపాడులో డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): సన్న, చిన్న కారు రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మర్రిపాడు మండలంలోని మర్రిపాడు, పల్లవోలు గ్రామాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతుల పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. రైతులు తమ పంట పొలాల్లో అమర్చుకున్న డ్రిప్ పరికరాల నాణ్యతను తనిఖీ చేసి వాటి వినియోగంపై రైతుల అభిప్రాయాలను, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి జిల్లాలో 2,900 హెక్టార్లలో డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు చేయాలనేది తమ శాఖ లక్ష్యంగా చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఐఈ బాలాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోండి



ఆత్మకూరు 1వ వార్డు పరిధిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: రాజ్యాంగం అందరి సమాన హక్కులు కల్పిస్తోందని, అయితే గిరిజనులు, దళితులు హక్కులపై అవగాహనలేక తాము పొందాల్సిన ప్రభుత్వ సంక్షేమం కోల్పోతున్నారని హక్కులపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు ఎం.లక్ష్మీనరసింహం అన్నారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు వెంకట్రావుపల్లి గిరిజనకాలనీలో శనివారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసులు, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జె ప్రసాద్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పెంచలనరసయ్య, వీఆర్‌ఓ కృష్ణ, స్థానిక కౌన్సిలర్ శివకోటారెడ్డి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



నాడు–నేడు పనులు పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఏఈ రాఘవ, ఎంపీపీ, ఎంఈఓ తదితరులు

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శనివారం ఎస్‌ఎస్‌ఏ ఏఈ రాఘవ పరిశీలించారు. ఇటీవల ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పాఠశాల కమిటీ సభ్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్‌ఎస్‌ఏ ఏఈ రాఘవ పనుల నాణ్యతా ప్రమాణాలను రీబండ్ హామర్‌తో పరిశీలించారు. ఎంపీపీ వెంకటరమణయ్య, ఎంఈఓ శ్రీధర్ సమక్షంలో పనుల నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు జరిగాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికార బృందం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో శనివారం జవహర్ నవోదయ పరీక్ష నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 182 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ తోట శ్రీనివాసులు తెలిపారు. ఆత్మకూరుతో పాటు అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాయించేందుకు తమ చిన్నారులను తీసుకుని తల్లిదండ్రులు పరీక్ష హాలు వద్దకు చేరుకున్నారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 240 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 166 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్ అధికారులు షేక్ గౌస్‌బాషా, శుభరంగ స్వామి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఎంఈఓ మస్తాన్‌వలి తనిఖీ చేశారు.

జగనన్నే మా భవిష్యత్తుకు అనూహ్య స్పందన



పోషకాహార కిట్లు అందిస్తున్న వైద్యాధికారిణి శివకల్పనారెడ్డి

చేజర్ల(సోమశిల): జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని అనంతసాగరం మండలం జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాల పరిధిలో సుమారు 10 వేల కుటుంబాలను ఈ కార్యక్రమం ద్వారా కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని వివరించామన్నారు. నాలుగేళ్ల పరిపాలనలో 98 శాతం పైగా నెరవేర్చిన విషయాన్ని వివరిస్తుండంతో ప్రజల నుంచి సంతృప్తి కనిపిస్తోందని తెలిపారు. నాయకులు రాజారెడ్డి, ఏ ప్రసన్నకుమార్‌రెడ్డి, డి రామాంజనేయరెడ్డి, కే లక్ష్మీదేవి, ఏ కొండారెడ్డి పాల్గొన్నారు.